క్లుప్తంగా

ఈ క్రాప్ జాబితా ప్రదర్శన



ఆర్బీకే వద్ద ఈక్రాప్ జాబితాను ప్రదర్శిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

బలిజిపేట: రబీ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్‌లో నమోదైన పంటల వివరాల జాబితాను వంతరాం ఆర్‌బీకే వద్ద శనివారం ప్రదర్శించారు. అనంతరం ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు గ్రామసభ నిర్వహించి రైతులతో మాట్లాడారు. ఈక్రాప్ నమోదులో ఎమైనా చిన్న చిన్న తప్పులున్నా వాటిని సరిచేసుకునేందుకు ఇదే చివరి అవకాశమని తెలిపారు. 3వ తేదీ లోపల అభ్యంతరాలు ఉంటే తెలియ చేయాలని సూచించారు. ఈ నెల 7వ తేదీన తుది జాబితా ప్రచురితమవుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



సీతానగరం జీజే కళాశాలలో మందులను పరిశీలిస్తున్న తహసీల్దార్ జీవీ జనార్దన్

సీతానగరం: మండలంలోని రెండు కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు రెండోరోజు శనివారం ప్రశాంతంగా జరిగాయని తహసీల్దార్ జీవీ జనార్దన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జోగిపేట ఎస్‌ఓఈ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. సీతానగరం జీజే కళాశాల వద్ద ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచామన్నారు. విద్యార్థుల రాకపోకలకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటిండెంట్లు, పరీక్షల నిర్వాహకులు, ఇన్విజిలేటర్లు, ఏఎస్సై జి. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

200 లీటర్ల సారా పట్టివేత

సాలూరు: పట్టణంలో గుమడాం సమీపంలో శ్యామ్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై శుక్రవారం రాత్రి అక్రమంగా సారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ వాసునాయుడు తెలిపారు. అతని వద్ద 200 లీటర్ల సారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ముద్దాయిని రిమాండ్‌కు తరలించారు. ఎస్సై సీతారాం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



పూడికలు తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మక్కువ: మండలంలో కాశీపట్నం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శనివారం సర్పంచ్ చందరరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ములక్కాయవలస, మేలాపువలస కాలనీ, కొండరేజేరు, కాశీపట్నం గ్రామాల్లోని వీధికాలువల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. తాగునీటి వనరుల వద్ద క్లోరినేషన్ చేశారు.

31లోగా పన్ను చెల్లిస్తే వడ్డీమాఫీ

సాలూరు: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్నుల మొత్తాన్ని ఈ నెల 31లోగా చెల్లిస్తే వడ్డీ మాఫీ వర్తింప చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందని మున్సిపల్ కమిషనర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆస్తిపన్ను చెల్లింపుదారులందరూ మున్సిపల్ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో సీడీఎంఏ.ఏపీ.జీఓవీ.ఇన్ సైట్‌లో చెల్లింపులు చేసి రశీదు పొందవచ్చని పేర్కొన్నారు. పురప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 31 లోగా పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ సామల సింహాచలం

పార్వతీపురం టౌన్: కేపీఎం ఉన్నత పాఠశాలను పార్వతీపురం మండల విద్యాశాఖాధికారి - 1 సామల సింహాచలం శనివారం సందర్శించారు. ముందుగా ఇటీవల నిర్వహించిన ఎఫ్ఏ 4 పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం వై. అప్పలనాయుడు, పోలినాయుడు, విశ్వం, రమేష్, సీఆర్ఎంటీ పి. రూన్సీ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిడగల్లు.. అభివృద్ధిలో మేటి

- జగనన్న హయాంలో మౌలిక వసతుల కల్పన
- ఏ వీధిలో చూసినా సిమెంట్ రోడ్డే..
- లక్షలాది రూపాయలతో ప్రభుత్వ భవనాలు



నాడు నేడు నిధు లతో నిర్మించి ఉన్నత పాఠశాల అదనపుభవనాలు



సీతానగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయి. గ్రామస్వరాజ్యం సాధించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలన ప్రజల ముంగిటకు తీసుకువచ్చారు. ఏ పని కావాలన్నా గ్రామంలోనే జరిగేటట్లు ఏర్పాట్లు చేయడంతో ప్రజలకు ఎన్నో ఇబ్బందులు తప్పాయి. మండలంలోని నిడగల్లు గ్రామం ఒకప్పుడు అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటే.. నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. జగనన్న ప్రభుత్వం రాకతోనే కోట్లాది రూపాయల నిధులు వివిధ పథకాల ద్వారా మంజూరయ్యాయి. గ్రామంలో ఉన్న పాతశాల 'నాడు - నేడు' నిధులతో అభివృద్ధి చేశారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు అదనపు తరగతి భవనాలు నిర్మించారు. దీంతో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాదీ పెరుగుతోంది. అలాగే ఆధ్యాత్మిక భావం పెంపొందించాలనే ఉద్దేశంతో గ్రామంలో నీలకంఠేశ్వర ఆలయం నిర్మించారు. జేజేఎం నిధులతో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు.అలాగే పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు నిర్మాణానికి రూ. 1.80 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. మహిళల పేరిట జగనన్న కాలనీలు మంజూరు చేయడంతో పాటు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడంతో ఆ ఇంటిపై లబ్ధిదారుకు సంపూర్ణ హక్కు లభించేటట్లు చేయడం విశేషం. అలాగే ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, కాలువలు, భవనాలు, తదితర సౌకర్యాలు కల్పించడంతో నిడగల్లు గ్రామం అభివృద్ధి దిశగా పరుగులెడుతోంది. అలాగే సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది రూపాయలను లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పారదర్శక పాలన అందుతుండడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



సచివాలయ భవనం



సీసీ రోడ్డు



నిర్మాణంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయం



జగనన్న కాలనీలో పక్కాగృహాలు



సీసీ కాలువలు



ఇంటింటి కుళాయిలు

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు - నిధులు

సచివాలయ భవనం : రూ. 43,00,000
నీలకంఠేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణం : రూ. 40,00,000
జగనన్న హౌసింగ్ నిర్మాణాలు : రూ.1,65,60,570
ఇంటిస్థలాలు కొనుగోలు : రూ.3,51,78,000
వైఎస్సార్ ఆసరా : రూ.1,03,14,564
వైఎస్సార్ చేయూత : రూ.1.52,62,500
జగనన్న అమ్మఒడి : రూ.1, 76,01,420
రైతుభరోసా : రూ.3,59,20,350
వైఎస్సార్ పెన్షన్ కానుక : రూ.8,55,86,750
నాడు నేడు అభివృద్ధి పనులు: రూ.1,36,00,000
సీసీరోడ్లు, కాలువలు : రూ.74,60,000
ఇంటింటి కుళాయిలు : రూ.90,00,000

జగనన్నకు ధన్యవాదాలు..



దశాబ్దాల తరబడి నెలకొన్న సమస్యలను అధికారంలోకి రాగానే పరిష్కరించిన ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు. ముఖ్యంగా సీసీ రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయడం అభినందనీయం. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు. మా కుటుంబానికి ఆసరా, చేయూత, రైతుభరోసా, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలు వర్తిస్తున్నాయి. – అరసాడ శ్రీదేవి, పొదుపు సంఘ సభ్యురాలు, నిడగల్లు

అభినందనీయం..



జగనన్న ప్రభుత్వం రాకతో గ్రామంలో దీర్ఘకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమయ్యాయి. ఎమ్మెల్యే అలజంగి జోగారావు తీసుకున్న చొరవ కారణంగా గ్రామానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరయ్యాయి. దీంతో అధికారులు మౌలిక వసతులు కల్పించడం అభినందనీయం. ప్రధానంగా తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారమయ్యాయి. పక్కాగృహాలు మంజూరు చేసి సొంతింటి కల సాకారం చేసిన జగన్‌బాబు రుణం తీర్చుకుంటాం.
– కండి మరియదాసు, మాజీ సర్పంచ్, నిడగల్లు

ఆలయ పునర్నిర్మాణం..



ప్రభుత్వం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు జీర్ణావస్థకు చేరిన నీలకంఠేశ్వరస్వామి ఆలయం విషయం తెలియజేశాం. వెంటనే ఆయన దేవదాయశాఖ ద్వారా రూ. 40 లక్షలు మంజూరు చేయించడంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. అలాగే మా కుటుంబానికి వైఎస్సార్ ఆసరా, చేయూత, విద్యాదీవెన, పెన్షన్ పథకాలు వర్తిస్తున్నాయి.
– గంట శారద, పొదుపు సంఘ సభ్యురాలు, నిడగల్లు

గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: మహాత్మా గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. మండలంలోని కృష్ణరాయపురంలో బొబ్బిలి పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు సమకూర్చిన గాంధీజీ విగ్రహాన్ని ఆయన శనివారం సాయంత్రం ప్రారంభించారు. అంతకు ముందు గ్రామంలోని కృష్ణరాయపురం బస్టాండ్ వద్ద రెడ్డి పారినాయుడు, నారాయణమ్మ జ్ఞాపకార్థం రెడ్డి అప్పలనాయుడు కుటుంబీకులు నిర్మించిన ఆర్చ్‌ను ప్రారరంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని నిరంతరం ప్రజలు తిరుగాడే ప్రాంతంలో గాంధీజీ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రమణమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మామిడి బాబ్జీ, స్థానిక సర్పంచ్ గుణుపూరు అన్నంనాయుడు, బలిజిపేట వైస్ ఎంపీపీ సాయిబాబా, స్థానిక నాయకులు బలరాంనాయుడు, విగ్రహదాతలు బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జేసీ రాజు, గాదెలవలస స్కూల్ అసిస్టెంట్ ఎస్‌వీ రమణ, స్థానిక నాయకులు జి. అప్పలస్వామి, గంట సత్యంనాయుడు, సుమిత్రా పురం సర్పంచ్ బి. నందిని, గుచ్చిమి నాయకులు మర్రాపు ధనుంజయనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి. శ్రీరాములనాయుడు, పి. ఈశ్వరనారాయణలు, బి. ముకుంద ఉన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో (జగన్నాథపురం) నిర్మించనున్న సీసీ రోడ్డుకు సంబంధించి ఎమ్మెల్యే అలజంగి జోగారావు శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ ఎదురుగా గల భేరివీధి-1 లో ఇటీవల నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును.. నవిరి కాలనీలో గల రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యలు గుర్తించి పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్లు రణభేరి చిన్నంనాయుడు, ఎడ్ల త్రినాథ, నాయకులు ఆకుల శ్రీనివాసరావు, ఇజ్జవరపు పోలినాయుడు, రణభేరి సూర్యనారాయణ, సువ్వాడ శ్రీనివాసరావు, కొండపల్లి నాగభూషణ, విశ్వేశ్వరరావు, ప్రసాద్ రాయిగురు, నడిపేట రాము, అర్ల సూర్యారావు, స్థానిక కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విధానంతో విద్యా సామర్థ్యం

- డీఈఓ పగడాలమ్మ



విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ పగడాలమ్మ

సీతానగరం: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాన్ని పెంపొందిచడానికి డిజిటల్ విధానం దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి జి. పగడాలమ్మ అన్నారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అభ్యసనాభివృద్ధి, డిజిటల్ విధానంతో విద్యాబోధనలు, తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేదలందరికీ మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధనలు చేపట్టాలని చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సాలూరు రూరల్: మండలంలోని గిరిశిఖర గ్రామాలకు సుమారు రూ.4 కోట్లతో చేపట్టనున్న బీటీరోడ్ల నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. ఐటీడీఏ నిధులతో దిగువకాసాయివలస, తోణాపంచాయతీ పులివలస కాజ్‌వే నిర్మాణం, ఎం.కొత్తవలస బీటీ రోడ్డు, తుండ పంచాయతీ పరిధిలో జోడిమామిడి గ్రామాలకు బీటీరోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. దళాయివలస నుంచి దిగువకాశాయివలసకు వెళ్లాలంటే సువర్ణముఖి నది దాటాల్సిందే. తోణాపంచాయతీ పులివలస వద్ద కాజ్‌వే నిర్మాణంతో దిగువకాశాయివలస గ్రామానికి రాకపోకలు సులభతరమవుతాయి. ఒకేరోజు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో త్వరలోనే తమ కష్టాలు తీరనున్నాయని ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మక్కువ: మండలంలోని ములక్కాయవలసలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 3 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75 ఫీజు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని తెలిపారు. ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్ష తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం పురపాలక సంఘం, కొత్తవలస ప్రాంతం పరిధిలో ఉన్న 5, 6, 7, 8, 9 వార్డులకు చెందిన హౌసింగ్ లబ్ధిదారులకు శనివారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టాల పంపిణీలో ఎటువంటి వివక్ష కనబరచకుండా, అర్హులందరికీ న్యాయం చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని చేసిన మేలును లబ్ధిదారులు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ పి. సింహాచలం, కౌన్సిలర్లు పి. జయంతి, బి. ఆనంద్, మజ్జి పారినాయుడు, ఆర్. చిన్నంనాయుడు, కో ఆప్షన్ సభ్యుడు. ఎం. వెంకటరావు, జి. మాధవరావు, నేరేడుబిల్లి సదానందం, గోగు గాయత్రి, ఆకుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దేశవాళీ ఆవుకు పుంగనూరు దూడ జననం



పుంగనూరు దూడను సాకుతున్న ఆవు

సీతానగరం: మండలంలోని కోటసీతారాంపురంలో కె.రత్నాకర్‌కు చెందిన దేశవాళీ ఆవు పుంగనూరు దూడకు శుక్రవారం రాత్రి జన్మనిచ్చింది. ఇది దేశంలోనే అతి పొట్టి(12 అంగుళాలు) రకానికి చెందిన అరుదైనరకం. చిత్తూరు జిల్లా పుంగనూరు గ్రామంలో బ్రీడ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. పుంగనూరు జాతికి చెందిన ఆవు పాలు శ్రేష్టమైనవి. ప్రొటీన్లు, విటమిన్-ఎ, కాల్షియం అధికంగా ఉంటాయి. మండలంలోని సీతానగరం, కె.ఎస్.పురం, చినబోగిలి గ్రామాల్లోనూ పుంగనూరు జాతి దూడలున్నాయి. ఈ విషయమై పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ సీహెచ్ దీనకుమార్ మాట్లాడుతూ సీతానగరం పశువైద్య కేంద్రంలో ఎద ఇంజక్షన్ చేశామన్నారు. ప్రభుత్వం కృత్రిమ ఇంజక్షన్ల ద్వారా అరుదైన జాతికి చెందిన పశు సంపదను రక్షించేందుకు కృషిచేస్తోందన్నారు.

రహదారి మరమ్మతులకు చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సీతానగరం - చిన బోగిలి గ్రామాలతో పాటు ఆర్‌ఓబీ మరమ్మతులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే సువర్ణముఖీ నదిపై నారాయణపురం వంతెన పనులు పూర్తిచేసి జాతికి అంకితం చేశామన్నారు. త్వరలో గెడ్డలుప్పి వంతెన పనులు పూర్తిచేసి అప్రోచ్ రోడ్డు వేసి ప్రారంభించడానికి సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బి. శ్రీరాములనాయుడు, సూర్యనారాయణ, జి. శంకరరావు, చినబోగిలి, సీతానగరం గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం ఆదేశాలతో విద్యార్థికి మెరుగైన వైద్యం



విద్యార్థి సోమయ్యను పరామర్శించిన పాఠశాల హెచ్ఎం మహేంద్రనాథ్

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో గిరిజన విద్యార్థి ప్రాణాపాయం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. సాలూరు మండలం అంటివలస గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమపాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి టింగలి సోమయ్య గత నెల 28న రాత్రి 7 గంటల సమయంలో తీవ్ర కడుపునొప్పికి గురికావడంతో పాఠశాల సిబ్బంది మామిడిపల్లి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక వైద్య సేవలందించి 29న ఉదయం సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించడంతో అదేరోజు రాత్రి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్కడి వైద్యులు అపెండసైటిస్‌గా నిర్ధారించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై హెచ్ఎం మహేంద్రనాథ్ ఈ నెల 2న డిప్యూటీ సీఎం రాజన్నదొర దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి జిల్లా వైద్యాధికారులతో మాట్లాడారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అధికారులు తక్షణమే స్పందించి విద్యార్థికి ఆపరేషన్ చేశారు. శనివారం డిప్యూటీ సీఎం విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీయగా.. ఆపరేషన్ విజయవంతం అయిందని, ప్రస్తుతం విద్యార్థి సురక్షితంగా ఉన్నట్లు చెప్పారు. విద్యార్థి ఆరోగ్యంపై వెంటనే స్పందించి మెరుగైన వైద్యం అందించిన డిప్యూటీ సీఎం రాజన్నదొరకు పాఠశాల ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలియజేశారు.

చిన్నారులకు చుక్కల మందు తప్పనిసరి



ఆటో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి డాక్టర్ పావని, తదితరులు

సీతానగరం: ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పల్స్‌పోలియో చుక్కల మందు తప్పనిసరిగా వేయించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పావని కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆటో ద్వారా శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆదివారం ఉదయం 7 గంటల నుంచి దేవాలయాలు, బస్‌స్టాప్‌లు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రామమందిరాలు, రచ్చబండలు, రైల్వే స్టేషన్లు, తదితర ముఖ్యకూడళ్లలో బూత్‌లు ఏర్పాటు చేసి చుక్కల మందు వేస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ డి. సత్యవతి, హెచ్‌వీ భవాని, హెల్త్ సూపర్‌వైజర్ శర్మ పాల్గొన్నారు.